**రాఘవ** ఆ వీధిలో ధైర్యంగా నడుస్తున్నాడు.

క్రితకు ముందు ఒకటి రెండు సార్లు ఆ వీధికి వచ్చినప్పుడు కొంత భయం, బెరుకు, కంగారు రాఘవను చుట్టు ముట్టాయి. ఇప్పు డా భయం, బెరుకు అతనిలో మచ్చుకైనా లేవు.

సమయం మధ్యాహ్నం మూడు గంటలు దాటింది. వీధిలో కొన్ని ఇళ్ళు కళ్ళు మూసుకున్నట్టుగా ఉన్నా, అక్కడక్కడా అరుగుల మీద కొంతమంది ఆడవాళ్ళ వెకిలి నవ్వులు, చౌకబారు మాటలు రాఘవ చెవిని పడుతున్నాయి. కొత్త వ్యక్తి ఎవరా అని ఎగాదిగా చూస్తూ కళ్ళతో, సైగలతో పలకరింపులు. ఏయ్ ఇలా రా అబ్బాయ్ అంటూ ఆహ్వానాలు. వీధిలో మల్లె పూల సైకిళ్ళు తమ వ్యాపారా లిప్పుడే మొదలుపెట్టాయి. ఒక కిళ్ళీ కొట్టు ముందు మైకులో ' బిగి కౌగిలి' సినిమా పాట బిగ్గరగా వినబడుతూంది. రాఘవ ముందుకు చూస్తూ గబ గబా నడుస్తున్నాడు. అతని అడుగులు నేలమీద తేలి పడుతున్నాయి. మనసు ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతూంది. ఆ ఆనందానికి కారణం రాఘవ కిప్పుడు లోగ్ అండ్ లోగ్ లిమిటెడ్‌లో అతని డిగ్రీకి తగిన మంచి ఉద్యోగం దొరికింది. వయస్సు పాతికేళ్ళు దాటిన తరవాత—తల్లి, తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళతో నిరుద్యోగిగా నిశ్చష్ట జీవితం గడిపిన రాఘవ కిప్పుడు ఉద్యోగం దొరకడం నిజంగా ఒక నిధి దొరికినట్లే అయింది. అందుకే రాఘవ పతంజలి ఇంటికి ఆనందంగా బయలుదేరాడు.

పతంజలి ఇంటి ముందు మెట్లెక్కుతూ లోపలికి చూశాడు రాఘవ. గది తలుపులు మూసి ఉన్నాయి. వరండాలో మడత మంచంమీద పడుకున్న ముసలమ్మ గబుక్కున లేచి —"రండి బాబూ రండి. ఆ కుర్చీలో కూర్చోండి" అంటూ నవ్వుతూ తన గార పట్టిన పళ్ళన్నింటినీ బయట పెట్టింది. రాఘవ




శ్రీకంఠమూర్తి

# మహాభిషేకం

ఇబ్బందిగా కుర్చీలో కూర్చున్నాడు.

''ఒక్క పది నిమిషాలు. అమ్మాయి లోపల ఎవరో స్నేహితురాలితో ఉంది!'' ముసలమ్మ ఇంకా ఏదో గొణుక్కుంటూ ఆ ఇంటి పక్క సందులోకి వెళ్ళిపోయింది. రాఘవ ఆలోచిస్తూ కూర్చున్నాడు. అతనికి పతంజలి జీవితం పూర్తిగా అర్థమయింది. పట్టపగలుకూడా ఎవరో ఒకరు వస్తూ పోతుంటారన్నమాట. నమ్ముకున్న వృత్తి శరీరాన్నమ్ముకోవడం. ఆ వృత్తికి రాత్రి పగలు తేడా ఏమిటి? పతంజలి రూపం కళ్ళల్లో మెదిలింది. ఆమె చేసిన సహాయమూ గుర్తుకొచ్చింది. రాఘవ హృదయం నిండా కృతజ్ఞత తొణికిసలాడింది.

రోగ్ అండ్ రోగ్ లిమిటెడ్‌లో మూడు, సూపర్‌వైజరు పోస్టులకి మూడువేలమందిని ఇంటర్వ్యూకి పిలిచారు. ఇంటర్వ్యూకి తనూ వెళ్ళాడు కాని, ఉత్తరాయణ—దక్షిణాయణాల వలయంలో తనకా ఉద్యోగం రాదని ఖచ్చితంగా తెలిసిపోయింది. నిరాశగా వెనక్కి పోతూంటే ఆఫీసు అటెండరు ఒకడు పదు రూపాయల ముడుపుతో తనకో తారక—'కీ' మంత్రం ఉపదేశించాడు. ఆ మంత్రోపదేశ ఫలితమే పతంజలి ప్రయోగం.

ఆ రోజు ఆలోచనలతో బుర్ర బద్దలు కొట్టుకుంటూ ఈ వీధిలో నిరాశగా నడిచి పోతున్నాడు. పతంజలి ఒక అరుగు మీద నిలబడి లోపలికి రమ్మంటూ నవ్వుతూ ఆహ్వానించింది. ఆమె పిలుపులోని ఆంతర్యం లక్ష్మణులు ఆమె అందం, వయస్సు, ఆకర్షణ చూసి తనకో ఆధారం దొరికినట్టయి వచ్చిన పని చెప్పాడు. ఆమె ఆశ్చర్యపడింది. తన నిరుద్యోగ కష్టాలు, బరువు, బాధ్యతలు అన్నీ ఏకరువు పెట్టుకున్నాడు. ఎలాగైనా సరే సహాయం చెయ్యమని దీనంగా వేడుకున్నాడు. పతంజలి ఆ పనికి ఒప్పుకుంది. మరునాడే తెలివిగా తన బాధ్యత నిర్వర్తించింది. ఫలితంగా తనకు ఉద్యోగం వచ్చింది.

ఇంటర్వ్యూ చేసిన ఆ కంపెనీ మేనేజింగు డైరెక్టరుకు ఏభై ఏళ్ళు. పేరు బ్రహ్మానందం. మనిషి తాటి డబ్బాలా ఉంటాడు. బట్టతల, బాన బొజ్జ, బావురుపిల్లి మొహం. బ్రహ్మానందం వయసులో ఉన్న ఏ ఆడపిల్లను చూసినా వెర్రెక్కి పోతుంటాడు. కొంగు వాసన తగిలితే చాలు—చొంగలు కారుస్తూ దాని కంటుకుపోతాడు. ఆఫీసులో అటెండరు చెప్పిన తారక 'కీ' మంత్రోపదేశం ఇదే!

పతంజలి రాఘవ పనిమీద బయలుదేరింది. పైట భుజాల మీదుగా నిండుగా కప్పుకుని, నిదానంగా మేనేజింగు డైరెక్టరు బ్రహ్మానందాన్ని కలిసింది. తను రాఘవకు మేనత్త కూతురుగా పరిచయం చేసుకుంది. బావకు ఉద్యోగం ఇవ్వకపోతే కుటుంబం యావత్తూ వీధిన పడి పోతుందని, ఉద్యోగం వస్తేనే బావతో తనకు పెళ్ళవుతుందని బ్రహ్మాండంగా నటించింది. కన్నీళ్ళు పెట్టుకుంది. కష్టాలు ఏకరువు పెట్టింది. బ్రహ్మానందం కరగలేదు. ఆమె వైపు వెర్రిగా చూశాడు. అతని కోరిక అర్థమయింది. తన బావ కోసం. అతని ఉద్యోగం



ఫోటో: పద్మినీ ప్రియదర్శిని

కోసం ఏ పని కైనా సిద్ధమే నంటూ చిటికలో ఒప్పుకుంది. ఆ రాత్రి కార్యం సాధించింది. ఒప్పుకోవడం ఆమెకు కొత్త కాదు. పతంజలి పడుపు వృత్తిలో బతుకుతున్నదే! కాని, ఆమె చేసిన ప్రయత్నం వృత్తి పరంగా చేసిన సహాయం రాఘవ జీవితానికో ఉపాధి కల్పించింది.

రాఘవ ఆలోచనల్ని భంగపరుస్తూ చిన్న శబ్దంతో గది తలుపులు తెరుచుకున్నాయి. గదిలోంచి ఇన్‌షర్ట్‌లో ఉన్న హిప్పీ క్రాపు కుర్రాడు ఒకడు తల వంచుకుని గబగబా బయటికి వెళ్ళిపోయాడు. గుమ్మం దగ్గర కొచ్చిన పతంజలి రాఘవను చూసి—''మీరా లోపలికి రండి'' అంటూ మొహం నిండా ఆనందాన్ని పులుముకుంది. రాఘవ గదిలోపలికెళ్ళి మూలనున్న ఒక స్టూలు మీద కూర్చున్నాడు.

తెల్లటి ఒంటిని అంటిపెట్టుకున్న నల్లటి అమెరికన్ జార్జెట్ చీర. అదే రంగు జాకెట్టు. కాటుక దిద్దిన కళ్ళల్లో ఎర్రటి జీరలు. అప్పుడే ముడి వేసుకున్న విడిపోయిన జుట్టు. మత్తుని నిద్ర లేమిని, బడలికన్ని అద్దంలా చూపిస్తున్న ముఖం. నలిగిపోతున్న పువ్వులాంటి సొగసు. కమిలి పోతున్న ఇరవై ఏళ్ళ వయస్సు. ఈ పాపపంకంలో ఎలా కూరుకు పోయిందీ పతంజలి?

''ఏమిటి? అంత దీక్షగా చూస్తున్నారు నన్ను?'' పతంజలి తీయని పలకరింపుతో రాఘవ వూహలు చెల్లా చెదురైనాయి.

''నాకు రాజమండ్రీ ఆఫీసులో పోస్టింగు వచ్చింది. నిజంగా మీరు చేసిన సహాయం నా జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేను.'' రాఘవ గొంతు నిండా ఆర్ద్రత, అభిమానం.

''రాజమండ్రిలోనా...చాలా సంతోషం.'' ఆమె కళ్ళల్లో కోటిదీపాలు. అంతలోనే ఆ దీపాల వెనక ఏవో నీలినీడలు.

''మీకు చెప్పినట్టుగా నా మొదటి జీతం రాగానే అందులో సగం సొమ్ము మీకు తప్పకుండా అందజేస్తాను.'' రాఘవ ఆమెకు వాగ్దానం చేస్తున్నట్టుగా అన్నాడు.

''మీరు నాకేమీ ఇవ్వక్కర్లేదు కాని, నాదో చిన్న కోరిక. మీరు తీర్చగలరా అని.'' పతంజలి రాఘవ కళ్ళల్లోకి సందేహంగా చూస్తూ సూటిగా అడిగింది. రాఘవ ఆమె చూపులకి తడబడ్డాడు. ముఖకవళికలు మారిపోయాయి. మనసులో వేయి ప్రశ్నలు కెరటాల్లా ఎగిసి పడ్డాయి. ఏమిటా కోరిక? ఏమిటది? పతంజలి తన నుండి ఆశించే దేమిటి? తను జీతంలో సగం సొమ్ము ఎలాగూ ఇస్తానని ఒప్పుకున్నాడు. ఆమె వద్దంటూంది. మరి? రాఘవ నరాల్లో సన్నటి ప్రకంపన. అలజడి.

''చెప్పండి—నా శాయశక్తులా మీ కోరిక తీర్చడానికి!!''

''వద్దులెండి. మీ రేదో భయపడుతున్నట్టున్నారు.'' పతంజలి పంటితో పెదాన్ని నొక్కుతూ అంది.

''నో నో అలాంటిదేం లేదు. మీరు నాకు చేసిన సహాయం ముందు నే నేం చేసినా తక్కువే!'' రాఘవ పైకి గంభీరంగా అన్నాడే కాని, మనసు మారుమూల సముద్రపు హోరు.

''మీకు రాజమండ్రిలో పోస్టింగన్నారుకదూ అక్కడ జాంపేటలో మా వాళ్ళు.. అమ్మా, నాన్న, ఇద్దరు తమ్ముళ్ళు. ఇదిగో మా వాళ్ళ ఎడ్రస్సు.'' పతంజలి గోడ పక్క వెంకటేశ్వర పటం వెనుక నుంచి చీటీ ఒకటి తీసి రాఘవ చేతి కిచ్చింది. రాఘవ ఆ అడ్రసు నాలుగుసార్లు చదివి పర్సులో పెట్టుకున్నాడు.

''నాకో చెల్లెలుకూడా ఉంది. పేరు పరిమళ. పదవ తరగతి చదివింది. తప్పటడుగు వేసి దారి తప్పిన నా కారణంగా పరిమళకు పెళ్ళి కావడం లేదు. ఎన్నో సంబంధాలు వచ్చి వెనక్కి పోతున్నాయి. దాని పెళ్ళి గురించి అమ్మా, నాన్న నిత్యం కుమిలి పోతున్నట్టు. నేను చేసిన తప్పుకు పరిమళ శిక్ష అనుభవిస్తున్నట్టు ఒక స్నేహితురాలు నాకు ఉత్తరం రాసింది. తెలివైన పిల్ల. కొద్దో గొప్పో వాళ్ళు కట్నంకూడా ఇవ్వగలరు. మీకు అభ్యంతరం లేకపోతే, ఇష్టమయితే. నా చెల్లెలు పరిమళని మీరు పెళ్ళి చేసుకోగలరా!'' పతంజలి మాటల్లో విషాదం, ఆవేదన ప్రవాహంలా పొంగి పొర్లాయి. రాఘవకు నోట మాట రాలేదు. మనసు మొద్దు బారినట్టయింది. అందమైన వల... తనను ఏదో ఆహ్వానిస్తున్నట్టనిపించింది.

పడుపు వృత్తిలోని ఒక ఆడదాని చెల్లెల్ని కావాలని పెళ్ళి చేసుకోవడమా? ఇది వీలవుతుందా! నో... తన వాళ్ళెవరూ ఒప్పుకోరు. అయినా తను చేసిన సహాయానికి ఇటువంటి కోరిక కోరుతుందని ముందుగా వూహించ లేకపోయాడు. ఆమె ఆశ పడటంలో న్యాయం ఉంటే ఉండొచ్చు. కాని, తనకు అదెలా సాధ్య పడుతుంది? ఆ రోజు ఏభై రూపాయలు ఎడ్వాన్సుగా ఇవ్వబోతే వద్దని నిరాకరించింది ఇందుకేనా?

''సారీ! ఈ విషయంలో ఆలోచించుకోవడానికి నాకు కొంత వ్యవధి కావాలి.'' రాఘవ తలవంచుకుని గదిలోంచి చరచరా బయటికి వెళ్ళిపోయాడు. నడుస్తున్న బొమ్మలా ఆమె గుమ్మం దగ్గరకొచ్చి, అతడు వీధి చివరకు వెళ్ళేవరకు అలా చూస్తూనే నిలబడింది. కనీసం రాఘవ వెనక్కి తిరిగిచూడు లేదు. పతంజలి పెదాలపై పేలవమైన చిరునవ్వొకటి వెలిగి ఆరిపోయింది. ఆ నవ్వులో ఎన్నెన్నో భావాలు ... మువ్వా మామూలు మనిషివే! మగాడివే!

